సాక్షి
సంగారెడ్డి
శుక్రవారం । 21 । జూలై । 2023

న్యూస్‌రీల్

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

డీఎంహెచ్‌ఓ గాయత్రి దేవి

సంగారెడ్డి మున్సిపాలిటీ: జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున గురువారం వైద్యఆరోగ్య అధికారులతో డీఎంహెచ్‌ఓ గాయత్రి దేవి అత్యవసర సమావేశం నిర్వహించారు. వైద్యఆరోగ్య సిబ్బందిని అప్రమత్తంగా ఉండాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 285 రాపిడ్ రెస్పాన్స్ టీమ్స్ ఏర్పాటు చేశామన్నారు. సబ్ సెంటర్ లెవెల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, డివిజన్ లెవెల్ టీమ్స్ అందుబాటులో ఉంటాయన్నారు. గర్భిణులకు అత్యవసర సమయంలో మందులు అందుబాటులో ఉంచామని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు సాయంత్రం 6 గంటల వరకు ఉండాలన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులతో కలిసి మెడికల్ ఆఫీసర్ గ్రామంలోని పారిశుద్ధ్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా అనారోగ్యానికి గురైతే వెంటనే అక్కడ హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆరోగ్య సమస్యలపై ఏఈ కంట్రోల్ రూమ్ 9494851165, సదాశివపేట కంట్రోల్ రూమ్9440426531, జహీరాబాద్ కంట్రోరూమ్, 9010654984, నారాయణకేహెడ్ కంట్రోల్ రూమ్ 9493935577 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఎన్నికల నిర్వహణ కమిటీలో గీతారెడ్డికి చోటు



జహీరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీలో నియోజకవర్గం ఇన్‌చార్జి, మాజీ మంత్రి జె.గీతారెడ్డికి చోటు లభించింది. గురువారం ఏఐసీసీ విడుదల చేసిన జాబితాలో ఆమెకు చోటు కల్పించారు. రాష్ట్రంలో 26 మందిని ఎంపిక చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికలకుగాను ఈ కమిటీని ఏర్పాటు చేశారు. జహీరాబాద్ నియోజకవర్గం నుంచి గీతారెడ్డి రెండు పర్యాయాలు గెలుపొంది మంత్రి వర్గంలో చోటు దక్కించుకున్నారు. గత ఎన్నికల్లో ఆమె ఓటమి పాలయ్యారు.

ఇరిగేషన్ ఈఈ బదిలీ

సంగారెడ్డి మున్సిపాలిటీ: నీటిపారుదల శాఖ ఈఈ మధుసూదన్ రెడ్డిని బదిలీ చేస్తూ ఇరిగేషన్ శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన పెబ్బేరుకు బదిలీ అయ్యారు. అక్కడ పని చేస్తున్న సురేశ్‌బాబు సంగారెడ్డి రానున్నారు.


29న పాతపెన్షన్‌దారుల రథయాత్ర

సంగారెడ్డి టౌన్: టీఎస్ సీపీఎస్‌ఈయూ ఆధ్వర్యంలో ఈనెల 29వ తేదీన పాతపెన్షన్‌దారుల ఆధ్వర్యంలో సంకల్ప సభ, ర్యాలీ నిర్వహిస్తున్నామని జిల్లా అధ్యక్షుడు రామ్ చందర్ గురువారం తెలిపారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో పోస్టర్‌ను విడుదల చేశారు. జిల్లాలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వరప్రసాద్, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, ఉద్యోగ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో లాభం

సంగారెడ్డి టౌన్: రైతులు ఆయిల్ ఫామ్ సాగు చేస్తే లాభదాయకమని గురువారం ఉద్యానవన పట్టు పరిశ్రమ శాఖ జిల్లా అధికారి శైలజ అన్నారు. ఆయిల్ పామ్ సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. సాగు చేపట్టే రైతులకు భారీగా సబ్సిడీలు ఇవ్వటం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా ఆయిల్ పామ్ మొక్కలు, డ్రిప్ పరికరాలు అందజేస్తారని తెలిపారు. మూడేళ్ల వరకు అంతర పంట వేసుకోవడానికి సబ్సిడీ ఇవ్వటం జరుగుతుందన్నారు. పామ్ ఆయిల్‌ను రైతుల దగ్గర కొనుగోలు చేసేందుకు గోద్రెజ్ ఆగ్రోవిట్ కంపెనీతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినిగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి ఉన్న రైతులు ఉద్యాన శాఖ అధికారులు, వ్యవసాయ అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ర్యాంప్‌ల కూల్చివేత



తొలగించిన ర్యాంప్‌లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతీనగర్ డివిజన్ పరిధి పాత ఎంఐజీ కాలనీలో బీహెచ్‌ఈఎల్ స్థలంలో నిర్మించిన ర్యాంప్‌ను భెల్ అధికారులు తొలగించారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ వెన్నవరం సింధు ఆదర్శ్‌రెడ్డి సంఘటన స్థలానికి వచ్చి బాధితులతో మాట్లాడారు. భెల్ అధికారులు ఇంటి ముందున్న ర్యాంప్‌లను తొలగించడం బాధాకరమన్నారు.

వాన.. హైరానా

- సుల్తాన్‌పూర్, గుమ్మడిదలలో 6.9 సెం.మీల వర్షం
- తెగిన తాత్కాలిక వంతెన కామారెడ్డి జిల్లాకు నిలిచిన రాకపోకలు
- ఉప్పొంగి ప్రవహిస్తున్న మంజీరా, నల్లవాగు
- రెండు ప్రాజెక్టులకు పెరిగిన ఇన్‌ఫ్లో..



కోహీర్ మండలంలో నీట మునిగిన పంట

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: జిల్లాలోని అమీన్‌పూర్, గుమ్మడిదల మండలాల్లో భారీ వర్షపాతం నమోదైంది. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో నమోదైన వర్షపాతం వివరాలను పరిశీలిస్తే.. అమీన్‌పూర్ (సుల్తాన్‌పూర్), గుమ్మడిదలల్లో 6.9 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైంది. మచంద్రాపురంలో 6.3 సెం.మీలు, హత్నూరలో 6.1 సెం.మీలు, పటాన్‌చెరువులో 6 సెం.మీలు, జహీరాబాద్ (మెల్చెల్మ)లో 5.1 సెం.మీలు, పుల్కల్ (లక్ష్మసాగర్)లో 4.9 సెం.మీలు, కందిలో 4.3 సెం.మీలు, మొగుడంపల్లిలో 4.2 సెం.మీలు, చౌటకూర్, సదాశివపేటలో 4.0 సెం.మీలు, కొండాపూర్‌లో 3.6 సెం.మీలు, జిన్నారంలో 3.5 సెం.మీలు, సంగారెడ్డిలో 3.4 సెం.మీల వర్షపాతం నమోదైంది. జిల్లాలో అన్ని మండలాల్లో వర్షంపాతం నమోదు కాగా, మూడో రోజు గురువారం కూడా ముసురు కొనసాగింది.

కొట్టుకుపోయిన రోడ్డు

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లో విస్తారంగా వర్షం పడింది. జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టు నల్లవాగులోకి భారీగా వరద నీరు చేరింది. నల్లవాగు ప్రాజెక్టులో 1488.10 అడుగుల మేర నీటి మట్టం చేరిందని ఏఈ సూర్యకాంత్ తెలిపారు. ఫత్తేపూర్–పిట్లం మార్గంలో నల్లవాగు వంతెన నిర్మాణం వద్ద తాత్కలికంగా వేసిన డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో సంగారెడ్డి–కామారెడ్డి జిల్లాల మధ్య రాకపోకలు స్థంబించాయి. పొలాల్లోకి నీరు నిలిచింది. కల్హేర్ వద్ద మహారాజు వాగులో వరద ఉధృతంగా ప్రవహిస్తోంది.

తీవ్ర నష్టం

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలో 42.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు గురువారం రెవెన్యూ అధికారులు తెలిపారు. ఇళ్లు కూలడంతో నిరాశ్రయులయ్యారు. సర్దార్‌తండాలో జ్యోతిరాజ్ ఇల్లు కూలింది. పంటలకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

జలమయం



కేరూర్ రోడ్డులో ప్రవహిస్తున్న నీరు

కోహీర్(జహీరాబాద్): మండలంలో భారీ వర్షపాతం నమోదైంది. వాతావరణ శాఖ అధికారులు అందించిన సమాచారం ప్రకారం గడిచిన 24 గంటల్లో 86.6 మిల్లిమీటర్ల భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. నారింజ, పెద్దవాగు, నక్కవాగు పరివాహక ప్రాంతంలో వేలాది ఎకరాల్లో పంట పొలాలు నీట మునిగాయి. విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడి రెండు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు.

ఊరు చెరువాయె..



రామచంద్రాపురంలో చెరువును తలపిస్తున్న డిపో రోడ్డు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): వర్షాలకు పొలాలు, రోడ్లు జలమయమయ్యాయి. గురువారం కురిసిన వర్షానికి పట్టణంలోని బస్‌డిపో మార్గంలో వర్షపు నీరు రోడ్లపై నిలిచింది. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో వనం చెరువు అలుగు పారింది. దాంతో యువకులు చేపలు పట్టేందుకు పోటీ పడ్డారు. వనం చెరువు అలుగు పరాడంతో పొల్లాలోకి నీరు చేరింది. విద్యుత్‌నగర్‌తో పాటు పలుచోట్ల రోడ్లపై నీరు చేరడంతో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పర్యటించారు.

పొంగుతున్న వాగులు



బోపన్‌పల్లి శివారులో అలుగుపారుతున్న దృశ్యం

ఝరాసంగం(జహీరాబాద్): మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. గురువారం మండల కేంద్రమైన ఝరాసంగంతో పాటు వివిధ గ్రామాల్లో కురిసిన వర్షానికి ప్రధాన రహదారులతో పాటు పంట పొలాలు జలమయమయ్యాయి. కృష్ణాపూర్ నుంచి జహీరాబాద్ వెళ్లే ప్రధాన రహదారిపైవర్షపు నీరు నిలిచింది. దీంతో రాకపోకలు అంతరాయం ఏర్పడింది. వాగులు పొంగి పొర్లాయి. వాగులపై ఉన్న అలుగులు పారాయి. ఏకధాటిగా వర్షం కురియడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటికి రాలేదు.

విపత్తుల సమయంలో ఎన్డీఆర్‌ఎఫ్ కీలకం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి

సంగారెడ్డి టౌన్: విపత్తుల సమయాల్లో ఎన్డీఆర్‌ఎఫ్ (నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) నిర్వర్తించే పాత్ర ఎంతో కీలకమైనదని అదనపు కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులు, ఎన్డీఆర్‌ఎఫ్ బృందంతో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎన్డీఆర్‌ఎఫ్ విజయవాడ 10 టిజి బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ ముఖేష్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లాలో 15 రోజులపాటు విపత్తుల సమయంలో ఎలా కాపాడుకోవాలో అవగాహన కల్పిస్తారన్నారు. ముఖ్యంగా పేలుళ్లు సంభవించినప్పుడు, ప్రమాదకర రసాయనాలు విడుదలైన సందర్భాల్లో ఎలా వ్యవహరించాలి, ప్రమాదాల్లో చిక్కుకున్న వారిని ఎలా కాపాడాలి, ప్రమాదం జరగకుండా ముందస్తు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తారని చెప్పారు. గజ ఈతగాళ్ల వివరాలను మున్సిపల్ కమిషనర్, ఆయా తహసీల్దార్లు, ఎంపీడీఓలకు అందజేయాలని మత్స్యశాఖ అధికారికి సూచించారు. సమావేశంలో డీఆర్‌ఓ నగేష్, డీఈఓ, మున్సిపల్ కమిషనర్, తారడిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, పోలీస్, ఫైర్, యూత్ వెల్ఫేర్, మెప్మా వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీ, ఎంప్లాయిమెంట్, అటవీ శాఖల అధికారులు, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, జైల్ సూపరింటెండెంట్, తదితరులు పాల్గొన్నారు.

నారింజ ప్రాజెక్టుకు వరద తాకిడి



నారింజ ప్రాజెక్టు

జహీరాబాద్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో జహీరాబాద్ ప్రాంతంలో పొలాలు, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచింది. లోతట్టు ప్రాంతాల వెంచర్లలోని పలు కాలనీలు జలమయమయ్యాయి. గురవారం సాయంత్రం వరకు వర్షం ఏకధాటిగా కురుస్తుండడంతో వాగులు ప్రవహిస్తున్నాయి. నారింజ వాగు కోహీర్, జహీరాబాద్ మండలాల్లో విస్తరించి పొలాల్లో నుంచి ప్రవహిస్తోంది. దీంతో పరిసరాల్లోని పంటలు నీట మునిగాయి. కొత్తూర్(బి) శివారులోగల నారింజ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి నీరు వచ్చి చేరుతోంది. శుక్రవారం ఉదయానికల్లా ప్రాజెక్టులోకి సామర్థ్యం మేరకు నీరు వచ్చి చేరే అవకాశం ఉన్నట్లు నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం సామర్థ్యానికి మూడు అంగుళాల మాత్రమే ఉంది. ప్రాజెక్టును ఈఈ సి.విజయ్‌కుమార్, డీఈఈ జనార్ధన్, ఏఈలు జానకిరాం, ప్రజ్వల, వై.రఘు, మహబూబ్‌అలీలు సందర్శించారు. గొటిగార్‌పల్లిలోని పెద్దవాగు ప్రాజెక్టు నుంచి నీరు దిగువ ప్రాంతానికి చేరుతోంది. మల్‌చల్మలోని ఈరన్నవాగు ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతున్నది. శేఖాపూర్‌లోని పలువురి ఇళ్లలోకి వరద నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. జహీరాబాద్ పట్టణం చుట్టూ భారీగా విస్తరించిన కాలనీలు, వెంచర్లలో వరద నీరు వచ్చి చేరింది. దీంతో కాలనీల్లో నివాసం ఉండే ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. ఇళ్ల నిర్మాణానికి అనువుగా లేని వెంచర్లలో ఇళ్లు నిర్మించుకోవడం వల్ల ఈ పరిస్థితి వచ్చిందని పేర్కొంటున్నారు.

టీఎస్‌ఐడీసీ చైర్మన్‌గా తన్వీర్



మంత్రి హరీశ్‌రావు సమక్షంలో టీఎస్‌ఐడీసీ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకుంటున్న ఎండీ తన్వీర్

- బాధ్యతల స్వీకరణ
- హాజరైన హరీశ్‌రావు, మహమూద్ అలీ

జహీరాబాద్: తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి సంస్థ కార్పొరేషన్(టీఎస్ఐడీసీ) చైర్మన్‌గా జహీరాబాద్‌కు చెందిన ఎండీ తన్వీర్ బాధ్యతలు స్వీకరించారు. గురువారం హైదరాబాద్‌లోని సంస్థ కార్యాలయంలో రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్‌అలీ, ఆర్థిక శాఖ మంత్రి టి.హరీశ్‌రావు, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రులు, ప్రజా ప్రతినిధులు తన్వీర్‌కు పుష్పగుచ్ఛాలు ఇచ్చి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రమాణ స్వీకార కార్యక్రమంలో టీఎస్ఎంఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, జీకాట్ రాష్ట్ర అధ్యక్షుడు ఢిల్లీ వసంత్, డీఆర్‌యూసీసీ సభ్యుడు షేక్ ఫరీద్, ఆత్మ చైర్మన్ ఎస్.పెంటారెడ్డిలు పాల్గొన్నారు.

శుభాకాంక్షల వెల్లువ

నియోజకవర్గ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకులు తన్వీర్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు. జహీరాబాద్, కోహీర్, ఝరాసంగం, న్యాల్‌కల్, మొగుడంపల్లి మండలాల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

తెరపైకి బీసీ మంత్రం..!

- ఉమ్మడి జిల్లాలో మూడు అసెంబ్లీ, ఒక ఎంపీ సీటు
- అన్ని పార్టీలు బీసీలకు కేటాయించాలని డిమాండ్
- ఇటీవల తీర్మానం చేసిన బీసీ రాజకీయ ఐక్యవేదిక



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: ఉమ్మడి మెదక్ జిల్లా రాజకీయాల్లో బీసీ నినాదం తెరపైకి వస్తోంది. ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో అన్ని ప్రధాన పార్టీల్లో బీసీలకు ప్రాతినిధ్యం అంశంపై చర్చ జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో పది అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాల్లో మూడు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానం టిక్కెట్‌ను బీసీలకే కేటాయించాలనే డిమాండ్ ప్రధానంగా వినిపిస్తోంది. ఇటీవల సంగారెడ్డిలో జరిగిన ఉమ్మడి మెదక్ జిల్లా బీసీ రాజకీయ ఐక్యవేదిక ఈ మేరకు తీర్మానం చేసింది. ఈ సందర్భంగా ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లో ఈ అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించింది. అధికార బీఆర్‌ఎస్‌తో, కాంగ్రెస్, బీజేపీలకు చెందిన నేతలు పాల్గొని తమ వాదాన్ని వినిపించారు. తాజా బుధవారం కాంగ్రెస్ పార్టీ కూడా ఓబీసీ సమావేశాన్ని సంగారెడ్డిలోని పీఎస్‌ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించింది. మాజీ ఎంపీ వి.హనుమంత్‌రావు హాజరైన ఈ సమావేశంలో ప్రధానంగా బీసీల ప్రాతినిధ్యంపైనే చర్చ జరిగింది. ఇటు బీజేపీ కూడా బీసీ వాదాన్ని తెరపైకి తెచ్చే ప్రయత్నం చేస్తోంది.

బీసీ ప్రాతినిధ్యం

- పటాన్‌చెరువు నియోజకవర్గంలో బీసీ వాదం గట్టిగా వినిపిస్తోంది. ఇక్కడ బీఆర్‌ఎస్ అభ్యర్థిత్వాన్ని సిట్టింగ్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికి సీఎం కేసీఆర్ బహిరంగసభలో పరోక్షంగా ఖరారు చేశారు. బీసీ ఈక్వేషన్‌లో తమ పేరును పరిశీలించాలని నీలం మధు ముదిరాజ్ అధిష్టానానికి విజ్ఞప్తి చేస్తున్నారు. తను సీఎం కేసీఆర్‌పై నమ్మకం ఉందని, తప్పకుండా తనకే టిక్కెట్టు వస్తుందనే ధీమా వ్యక్తం చేస్తున్నారు.
- నర్సాపూర్‌లో అధికార బీఆర్‌ఎస్ పార్టీలో సిట్టింగ్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో పాటు, మహిళా కమిషన్ చైర్మన్ సునీతా లక్ష్మారెడ్డి కూడా అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్నారు. ఇక్కడ బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి బీసీ నేతల పేరు వినిపిస్తుండటంతో బీఆర్‌ఎస్ నుంచి కూడా తమ పేరును పరిశీలించాలని వెల్దుర్తి ఎంపీపీ హరికృష్ణ పార్టీ ముఖ్యనేతల దృష్టికి తీసుకెళ్లడం రాజకీయా వర్గాల్లో అంతర్గతంగా చర్చ జరుగుతోంది.
- నారాయణఖేడ్ కాంగ్రెస్ టిక్కెట్టు ఆశిస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి తాను బీసీనని చెప్పుకుంటున్నట్లు సమాచారం. కర్ణాటకలో రెడ్డి సామాజికవర్గం బీసీ అని, అక్కడి నుంచి వచ్చిన తాము బీసీలమేనని చెబుతున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఓబీసీ సమావేశానికి సంజీవరెడ్డి హజరయ్యారు. ఇక్కడ బీఆర్‌ఎస్ అభ్యర్థిత్వం విషయంలో తమ పేరును పరిశీలించాలని బీసీ నేత విగ్రం శ్రీనివాస్‌గౌడ్ పార్టీ అధిష్టానాన్ని కోరుతుండటం అధికార బీఆర్‌ఎస్‌లో చర్చనీయాంశంగా మారింది.
- ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్యే పదవులతో పాటు, ఎమ్మెల్సీ పదవుల్లో పదవుల్లో అగ్రవర్ణాలకే అధిక ప్రాధాన్యత ఇచ్చారంటూ గతంలో బీఆర్‌ఎస్‌ను వీడిన సందర్భంగా జెడ్పీ మాజీ చైర్మన్ మురళీ యాదవ్ విమర్శలు చేయడం అప్పట్లో చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ ఇటీవల ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో బీసీలకే అధిక ప్రాధాన్యత ఇచ్చిందని గులాబీ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇలా అన్ని ప్రధాన పార్టీల్లో బీసీ నినాదం ప్రధానంగా చర్చ కొస్తుండటం గమనార్హం.

కాలుష్య పరిశ్రమలపై కఠిన చర్యలు

ఆర్‌డీఓ రవీందర్‌రెడ్డి హెచ్చరిక

సాక్షి ఎఫెక్ట్



జిల్లెల వాగులో కాలుష్య జలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ రవీందర్ రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని గడ్డపోతారం, ఖాజీపల్లి పారిశ్రామిక వాడల్లో గురువారం సంగారెడ్డి ఆర్డీఓ రవీందర్ రెడ్డి పర్యటించారు. ఈనెల 16న 'బాబోయ్ కాలుష్యం' పేరిట కథనాం సాక్షిలో ప్రచురితమైన విషయం తెలిసిందే. పీసీబీ ఈఈ కుమార్‌పాఠక్‌తో కలిసి ఆర్డీఓ గడ్డపోతారంలోని జిల్లెల వాగులో నిల్వఉన్న కాలుష్య జలాన్ని పరిశీలించారు. ఇక్కడి పరిశ్రమలు జల, వాయు కాలుష్యాన్ని వదులుతున్న తీరును పీసీబీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ చిట్ల సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు భార్గవ్, ఇతర ప్రజాప్రతినిధులు కాలుష్య సమస్యను ఆర్డీఓకు విన్నవించారు. ఇందుకు సంబంధించిన పూర్తి నివేదికలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని, కాలుష్య జలాలను వదులుతున్న పరిశ్రమలపై కఠిన చర్యలు తప్పవని ఆర్డీఓ హెచ్చరించారు.

ఓటరు సవరణపై సమావేశం

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో ఓటరు సవరణ కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయా రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ రవీందర్‌రెడ్డి స్థానికంగా లేనివారి ఓటు తొలగింపు, కొత్త ఓటు నమోదు తదితర అంశాలపై చర్చించారు. మున్సిపల్ పరిధిలో స్థానికంగా లేని 5 వేల ఓట్లను తొలగిస్తున్నామని అధికారులు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, నాయకులు మున్సిపల్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ, పక్కన కమిషనర్ సంగారెడ్డి

సింగూరుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

- ఈ సీజన్‌లో 1.5 టీఎంసీల నీరు చేరిక
- ప్రాజెక్టును సందర్శించిన అడిషనల్ కలెక్టర్



సింగూరు ప్రాజెక్టు వివరాలు తెలుసుకుంటున్న అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. ఉపరితల ఆవర్తనం ఏర్పడటంతో మంజీర పరీవాహకంలో కురిసిన వర్షపు నీరు డ్యాంలోకి చేరుతోంది. ఈ సీజన్‌లో పక్షం రోజులుగా ఇన్‌ఫ్లో పెరిగింది. దీంతో డ్యామ్ అధికారులు అప్రమత్తమై నిరంతరం ఇన్‌ఫ్లోను పరిశీలిస్తున్నారు.

బుధవారం నుంచి ఏకధాటిగా వర్షం కురుస్తుండటంతో గురువారం ప్రతి మూడు గంటలకు ఇన్‌ఫ్లో రీడింగ్ నమోదు చేశారు. డ్యాంలోకి ఉదయం 4574 క్యూసెక్కులు, 9 గంటలకు 6866, మధ్యాహ్నం 8533, సాయంత్రం 8625 క్యూసెక్కుల నీరు చేరిందని తెలిపారు. డ్యామ్ పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 29.900 టీఎంసీలు. ప్రస్తుతం 19.342 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రతీరోజు సాగుకు పంట కాలువ ద్వారా, తాగునీటికి మిషన్ భగీరథ నీటిని వదులు తున్నారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు డ్యామ్‌లోకి ఒకటిన్నర టీఎంసీల నీరు వచ్చిందని అధికారులు తెలిపారు.

ప్రాజెక్టుకు వరద చేరుతుండటంతో అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, నీటి పారుదల శాఖ ఈఈ మధుసూదన్ రెడ్డితో కలిసి ప్రాజెక్టును సందర్శించి వరద పరిస్థితిని తెలుసుకున్నారు. మంజీరా పరీవాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇన్‌ఫ్లో సమాచారాన్ని ఎప్పటి కప్పుడు పరిశీలిస్తుండాలని అధికారులకు సూచించారు. ముంపు ప్రాంతాల ప్రజలకు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ ఈఈ నాగరాజు, ఏఈఈ మహిపాల్ రెడ్డి, స్టాలిన్ ఉన్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి

పటాన్‌చెరు టౌన్: విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఏఎస్‌ఐ గౌస్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని గౌతమ్‌నగర్‌కి చెందిన శంషుద్దీన్ (24) వృత్తిరీత్యా ఎలక్ట్రీషియన్. గురువారం పటాన్‌చెరు మండలం కర్ధనూర్ గ్రామంలో భవనం నిర్మిస్తున్న సత్యం రాజు ఎలక్ట్రికల్ పనికోసం శంషుద్దీన్‌ను పిలిచాడు. పని ప్రదేశంలో గోడపై నడుచుకుంటూ వెళుతున్న క్రమంలోపైన విద్యుత్ వైరు తగలడంతో విద్యుదాఘాతనికి గురై అక్కడికక్కడ మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి సిరాజుద్దీన్ తన కుమారుడి మృతికి సత్యం రాజు నిర్లక్ష్యం కారణంగానే మృతి చెందాడని ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మురికి కాలువలోపడి వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

పటాన్‌చెరు టౌన్: మద్యం మత్తులో మురికి కాలువలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ భాస్కర్ గౌడ్ కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం కర్ధనూర్ గ్రామ సమీపంలోని బీరప్ప దేవస్థానం సమీపంలోని మురికి కాలువలో సుమారు 35–40 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి పడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు గురువారం ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మత్తులో కాలువలో పడి మృతి చెంది ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడికి సంబంధించిన బంధువులు ఉంటే తమను ఆశ్రయించాని బీడీఎల్ పోలీసులు కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

బాలుడి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: బాలుడు అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఓ కాలనీకి చెందిన బాలుడు 8వ తరగతి చదువుతున్నాడు. బుధవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఆచూకీ లభించలేదు. కుమారుడు తల్లి పోలీసులను ఆశ్రయించడంతో ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తం

- సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత
- ఒక్కరోజే రూ.3,34,199 కాజేసిన కేటుగాళ్లు
- అనుమానం వస్తే ఫిర్యాదు చేయండి

సిద్దిపేటకమాన్: సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత అన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు చేసే ఫోన్ కాల్స్‌కు స్పందించకూడదని, ఎవరికి బ్యాంక్, ఏటీఎం కార్డు, ఓటీపీ వివరాలు తెలపకూడదని చెప్పారు. కమిషనరేట్ పరిధిలో గురువారం పలు రకాల సైబర్ మోసాల్లో పలువురు బాధితుల ఖాతా నుంచి రూ.3,34,199 కాజేసినట్లు తెలిపారు. సీపీ తెలిపిన వివరాల ప్రకారం..సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి టెలిగ్రాంలో ట్రేడింగ్ మెసేజ్ చూసి అందులో ఉన్న నంబర్‌కు ఫోన్ చేయగా.. తక్కువ పెట్టుబడి పెడితే ఎక్కువ మొత్తంలో లాభాలు వస్తాయని తెలిపాడు. గుర్తు తెలియని వ్యక్తి తెలిపిన మాటలు నమ్మిన బాధితుడు.. సైబర్ నేరగాడు పంపిన లింక్ ఓపెన్ చేసి ఆన్‌లైన్ బ్యాంకింగ్ ద్వారా ఆరు విడతలుగా మొత్తం రూ.2,15,668 పంపించాడు. రెండు రోజుల తర్వాత లింకు ఓపెన్ చేయగా బ్లాక్ అయింది. దీంతో మోసపోయానని గుర్తించి జాతీయ హెల్ప్‌లైన్ నంబర్‌కు బాధితుడు ఫిర్యాదు చేశాడు.



పార్ట్ టైం జాబ్ పేరుతో..

సిద్దిపేట వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి ఫేస్‌బుక్‌లో పార్ట్‌టైం జాబ్ అనే ప్రకటన చూసి అందులో ఉన్న నంబర్‌కు ఫోన్ చేశాడు. గుర్తు తెలియని వ్యక్తి సూచించిన విధంగా బాధితుడు పలు విడతలుగా గూగుల్ పే ద్వారా రూ.67,350 పంపించాడు. తర్వాత కూడా మరిన్ని డబ్బులు అడగగా అనుమానంతో జాతీయ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేశాడు.

ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం పేరిట

సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ మహిళ ఇన్‌స్టాగామ్‌లో నటరాజ్ పెన్సిల్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగం ఉందని, ఇంటి నుంచి పనిచేసుకోవచ్చనే ప్రకటన చూసి అందులో ఉన్న నంబర్‌కు ఫోన్ చేసింది. ముందుగా ఐడీ కార్డు, ప్రాసెసింగ్ చార్జీలు ముందుగా చెల్లించాలని గుర్తు తెలియని వ్యక్తి తెలపగా.. ఆ మాటలు నమ్మిన బాధితురాలు ఆన్‌లైన్‌లో రూ.25,182 పంపించింది. తర్వాత ఫోన్ చేయగా ఎలాంటి స్పందన లేకపోవడంతో అనుమానం వచ్చిన బాధితురాలు జాతీయ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేశాడు.

కస్టమర్ కేర్ పేరుతో

గజ్వేల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి డబ్బులు ట్రాన్స్‌ఫర్ గురించి ఆన్‌లైన్‌లో వెతికి అందులో ఉన్న నంబర్‌కు ఫోన్ చేశాడు. గుర్తు తెలియని వ్యక్తి మాట్లాడి డబ్బులు రీఫండ్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోమని సూచించగా.. ఆ మాటలు నమ్మిన బాధితుడు యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకున్నాడు. అందులో క్రెడిట్ కార్డు వివరాలు, ఓటీపీ వివరాలు నమోదు చేయగానే.. తన ఖాతా నుంచి రూ.25,999 డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. వెంటనే ఆ నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో అనుమానం వచ్చి బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు. కాబట్టి సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీపీ చెప్పారు.

అయ్యో పాపం ఉమాజీ

గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టి మృత్యువాత

కల్హేర్(నారాయణఖేడ్): కూలీ పనులు చేసేందుకు వచ్చి గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో ఇటుక బట్టీ కూలీ మరణించాడు. గురువారం నిజాంపేట్ మండలం మునిగేపల్లి శివారులో సంగారెడ్డి–నాందేడ్ 161 జాతీయ రహదారిపై సంఘటన జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం ఔరాద్ రాంనగర్ కాలనీకి చెందిన ఉమాజీ (47) ఇటుక బట్టీలో కూలీ పనులు చేసేందుకు వచ్చాడు. పనులు పూర్తి చేసుకుని తోటి కూలీలతో కలిసి రాత్రి అక్కడే నిద్రిస్తున్నారు. నిద్ర నుంచి లేచిన ఉమాజీ జాతీయ రహదారిపై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో మృతి చెందాడు. ఎవరూ గుర్తుపట్టలేనంతగా శరీరం ఛిద్రమైంది. మృతుడి భార్య లక్ష్మీబాయి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేశామని కల్హేర్ ఎస్‌ఐ వెంకటేశం తెలిపారు.

దైవదర్శనానికి వెళ్లిన వ్యక్తి అదృశ్యం


వెంకటేశం

చేర్యాల(సిద్దిపేట): సూర్యాపేట జిల్లా ఎర్రవరం లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వెళుతున్నా అని కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన మండల పరిధిలోని కడవేర్గు గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కొయ్యడ వెంకటేశంగౌడ్ (35) ఈ నెల 15న మొదటగా చేర్యాలకు వెళ్తున్నా అని చెప్పి ఇంటి నుంచి బయటకి వెళ్లాడు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో భార్య ఫోన్ చేసింది. జనగామ దగ్గరలో ఉన్నాను సూర్యాపేట జిల్లాలోని ఎర్రవరం లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వెళ్తున్నానని చెప్పిన వెంకటేశం తిరిగి ఇంటికి రాలేదు. తర్వాత ఫోన్ చేస్తే స్విచాఫ్ వచ్చింది. కుటుంబ సభ్యులు గురువారం చేర్యాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

తప్పతాగి పడిపోయి..



వర్గల్(గజ్వేల్): వర్గల్ మండలం నెంటూరు సమీప కెనాల్ వద్ద మద్యం మత్తులో పడిఉన్న గుర్తు తెలియని యువకుడిని గజ్వేల్ ఆసుపత్రికి తరలించినట్లు బేగంపేట ఎస్సై అరుణ్ తెలిపారు. బుధవారం రాత్రి తాగిన మత్తులో లేవలేని స్థితిలో ఉన్న అతని వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించినా నోరు విప్పలేదన్నారు. యువకుడిని వివరాలు తెలిస్తే బేగంపేట పోలీస్‌స్టేషన్ 8712667337 నెంబర్‌కు తెలియజేయాలని ఎస్సై సూచించారు.

కులం పేరుతో దాడి..కేసు నమోదు

జగదేవ్‌పూర్(గజ్వేల్): కులం పేరుతో దూషిస్తూ దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కృష్ణమూర్తి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. కుకునూర్‌పల్లి మండలం రాయవరం గ్రామానికి చెందిన రాజు అనే యువకుడు జగదేవ్‌పూర్ మండలం అనంతసాగర్‌కు చెందిన రవీందర్ అనే వ్యక్తి వద్ద ఇటీవల రెండు లేగదూడలను కొనుగోలు చేశాడు. దీనికోసం రూ.19 వేలు ఇవ్వాల్సి ఉండగా రూ.14 వేలు చెల్లించాడు. మిగతావి తర్వాత ఇస్తానని రాజు చెప్పాడు. కాగా, డబ్బుల కోసం రవీందర్ ఫోన్ చేయగా అనంతసాగర్‌కు వస్తున్నాను అక్కడ డబ్బులు ఇస్తానని రాజు చెప్పాడు. రాజు తన సోదరుడితో కలిసి అనంతసాగర్ బస్టాండ్‌కు వచ్చాడు. అక్కడ డబ్బుల విషయంలో రాజు, రవీందర్ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో రాజును కులం పేరుతో దూషిస్తూ రవీందర్ అసభ్యంగా మాట్లాడాడు. తన వెంట వచ్చిన ముగ్గురితో కలిసి రాజును కర్రలతో చితకబాదాడు. దీంతో బాధితుడు జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ కృష్ణమూర్తి తెలిపారు. రాజుపై జరిగిన దాడిని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ ఖండించారు. వెంటనే నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

వ్యక్తి అదృశ్యం


యూసఫ్ (ఫైల్)

సంగారెడ్డి టౌన్: వ్యక్తి అదృశ్యమైన సంఘటన సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కులబ్‌గూరు గ్రామానికి చెందిన సయ్యద్ యూసఫ్ (30) ఆటోడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మొబైల్ ఫోన్ పనిచేయడంలేదని రిపేర్ కోసం ఈనెల 14వ తేదీన సంగారెడ్డికి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో అతడి కోసం తెలిసినవారిని, బంధువులను విచారించినా ఆచూకీ లభించకపోవడంతో భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సూపర్‌వైజర్‌కు జరిమానా

సిద్దిపేటకమాన్: సిద్దిపేట కోమటిచెరువులో డైనోసార్ పార్క్ సూపర్‌వైజర్ పనిలో పెట్టుకున్న వర్కర్స్ చెత్తను వేయడంతో సూపర్‌వైజర్ రజనిబాబుకు గురువారం రూ.10వేల జరిమానా విధించినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.

చెట్టును ఢీకొట్టిన కారు.. వ్యక్తి మృతి


సర్దార్ సన్నిసింగ్ (ఫైల్)


అదుపుతప్పి చెట్టును ఢీకొన్న కారు

గజ్వేల్‌రూరల్: గుంతలమయమైన రోడ్డుపై ఓ కారు అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన గజ్వేల్ మండలం కోమటిబండ సమీపంలో చోటు చేసుకుంది. గజ్వేల్ ఏఎస్‌ఐ పండరి తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్ ప్రాంతానికి చెందిన సర్దార్ సన్నిసింగ్(33)తోపాటు అతని స్నేహితులు సాయిమాధవ్, బి. విశాల్, సాయికుమార్‌లతో కలిసి బుధవారం శామీర్‌పేటలోని కట్టమైసమ్మ వద్ద జరిగిన కార్యక్రమానికి హోండా సిటీ (టీఎస్ 07ఈడీ 0908) కారులో వచ్చారు. తిరిగి కరీంనగర్‌కు వెళ్తున్న క్రమంలో తూప్రాన్‌లో ఉన్న విశాల్ భార్యను తీసుకువచ్చేందుకు బుధవారం రాత్రి బయలుదేరారు. ఈ క్రమంలో గజ్వేల్ మండలం ధర్మారెడ్డిపల్లి శివారులో కోమటిబండ సమీపంలో గుంతలమయమైన రోడ్డుపై కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న సర్దార్ సన్నిసింగ్(33) తీవ్ర గాయాలై మృతి చెందగా, కారులో ఉన్న మరో ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సర్దార్ సన్నిసింగ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కేజ్ వీల్ కిందపడి వ్యక్తి మృతి


శ్రీనివాస్ (ఫైల్)

టేక్మాల్(మెదక్): ట్రాక్టర్ దున్నుతుండగా ప్రమాదవశాత్తు కేజ్ వీల్ కింద పడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన టేక్మాల్‌లో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. టేక్మాల్‌కు చెందిన చాకలి శ్రీనివాస్(28) ట్రాక్టర్ డ్రైవింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం గ్రామ శివారులో ఓ పొలంలో కేజ్‌వీల్ ట్రాక్టర్‌తో దున్నుతుండగా ప్రమాదవశాత్తు జారి వీల్ కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఏఎస్‌ఐ తుక్కయ్య ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాస్‌కు గతేడాది వివాహం కాగా, అతడి భార్య పూజ ప్రస్తుతం గర్భిణీగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

మూర్ఛతో కార్మికుడి మృతి


సిద్దరాములు మృతదేహం

మనోహరాబాద్(తూప్రాన్): మూర్ఛతో కార్మికుడు మృతిచెందిన ఘటన మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లిలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం జనగాం జిల్లా వెల్దండ మండలానికి చెందిన సిద్దరాములు (41) కొన్ని నెలలుగా ముప్పిరెడ్డిపల్లిలో అద్దె కుంటూ స్థానికంగా ఉన్న ఓ పరిశ్రమలో పని చేస్తున్నాడు. మూడు రోజులుగా అనారోగ్యానికి గురైనట్లు స్థానికులు తెలిపారు. గురువారం ఉదయం తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చిన ఇరుగుపొరుగు తలుపులు తీసి చూడగా మృతిచెంది కనబడ్డాడు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలున్నట్లు తెలిపారు. ఎస్‌ఐ సందీప్‌రెడ్డిని వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

ఆస్పత్రికి తరలించి.. వైద్యం చేయించి..

మానవత్వం చాటిన మహిళ అధికారి


అస్వస్థతకు గురై రోడ్డు పక్కన పడి ఉన్న వ్యక్తిని రెడ్డిపల్లి పీహెచ్‌సీకి తీసుకెళుతున్న దృశ్యం

నర్సాపూర్: అస్వస్థత బాధపడుతూ.. వర్షంలో తడుస్తూ రోడ్డు పక్కన పడి ఉన్న వ్యక్తిని ఆస్పత్రిలో వైద్యం చేయించి ఓ మహిళ మానవత్వం చాటింది. నర్సాపూర్ ఐసీడీఎస్ సీడీపీఓ హేమభార్గవి విధుల్లో భాగంగా ఏఆర్‌ఈఎస్ సెక్రటరీ సునీతతో కలసి గురువారం మెదక్ వెళ్లి తిరిగి నర్సాపూర్ వస్తున్నారు. రెడ్డిపల్లి సమీపంలో జాతీయ రహదారి పక్కన రోడ్డుపై ఓ వ్యక్తి కింద పడిపోయి కనిపించాడు. వారు తమ వాహనాన్ని నిలిపి వెళ్లి చూసేసరికి అతను వర్షంలో తడిసి మాట్లాడలేని స్థితిలో ఉన్నాడు. దీంతో వెంటనే అతడిని తమ వాహనంలో సమీపంలోని రెడ్డిపల్లి పీహెచ్‌సీకి తరలించి వైద్యం చేయించారు. ప్రాథమిక వైద్యం అనంతరం వివరాలు అడగ్గా.. అతని పేరు ఒర్రె సాయిలు అని, తనది కామారెడ్డి జిల్లా పిట్లం మండలం బుర్నాపూర్ గ్రామమని చెప్పాడు. నాలుగు రోజుల క్రితం తన గ్రామం నుంచి బయలు దేరానని, హైదరాబాద్‌లోని లింగంపల్లికి వెళుతున్నట్లు వివరించాడు. అయితే.. నాలుగు రోజులుగా భోజనం లేకపోవడం, కాలినడక కొనసాగించడంతో కిందపడి పోయి ఉంటాడని సీడీపీఓ హేమభార్గవి చెప్పారు. అతని కాలికి గాయం సైతం ఉందన్నారు. ప్రస్తుతం అతను రెడ్డిపల్లి పీహెచ్‌సీలో వైద్యం పొందుతున్నాడు. వైద్యం అనంతరం అంగన్‌వాడీ టీచర్ హేమలత అతనికి భోజనం పెట్టడంతో పాటు పాత బట్టలు అందచేసినట్లు తెలిసింది. ఒకవైపు జోరుగా వర్షాలు కురుస్తున్నా..హేమభార్గవి, స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి సునీతతో పాటు అంగన్‌వాడీ టీచర్ సేవలను పలువురు ఈ సందర్భంగా అభినందించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


గుర్తు తెలియని మృతదేహం

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధిలోని మల్కాపూర్ 65వ జాతీయ రహదారిపై గుర్తు తెలియని మహిళా మృతదేహం లభ్యమైనట్లు కొండాపూర్ ఎస్‌ఐ వినయ్‌కుమార్ గురువారం తెలిపారు. బుధవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచామని, మృతురాలి వయసు 50 లోపు ఉంటుందన్నారు. వివరాలు తెలిసినవారు కొండాపూర్ సీఐ 8712656722, ఎస్‌ఐ 8712656748 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

కడుపు నొప్పి తాళలేక నిద్రమాత్రలు సేవించిన వైనం


మృతురాలు శివాణి(ఫైల్)

సిద్దిపేటరూరల్: చికిత్స పొందుతూ యువతి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని రాఘవాపూర్ గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. రాఘవాపూర్ గ్రామానికి చెందిన ఏర్వ నర్సవ్వ కూతురు ఏర్వ శివాణి (21)కి నెలరోజుల క్రితం అపెండిసైటిస్ ఆపరేషన్ జరిగింది. ఆపరేషన్ అయిన వారం రోజుల నుంచి కడుపులో నొప్పిగా ఉందని చెప్పగా కుటుంబీకులు ఆస్పత్రిలో చూపించారు. అయినా కడుపునొప్పి తగ్గలేదు. దీంతో ఈ నెల 12వ తేదీన రాత్రి సమయంలో ఆకస్మాత్తుగా వారి వద్ద కింద పడిపోయింది. ఏం జరిగిందని కుటుంబీకులు అడగడంతో కడుపునొప్పి భరించలేక బీపీ గోలీలు, నిద్రమాత్రలు వేసుకున్నానని చెప్పింది. దీంతో వెంటనే శివాణిని సిద్దిపేటలో పనిచేసే ప్రైమ్ కేర్ హాస్పిటల్‌లో చికిత్స నిమిత్తం చేర్పించారు. అప్పటికే పరిస్థితి విషమంగా ఉండడంతో అదేరోజు సిద్దిపేటలోని సురక్ష ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న శివాణి పరిస్థితి 19వ తేదీన మరింత విషమంగా మారడంతో వైద్యం నిమిత్తం సికింద్రాబాద్‌లోని యశోధ ఆస్పత్రిలో గురువారం ఉదయం 01:50గంటలకు చేర్పించారు. దీంతో శివాణిని పరీక్షించిన వైద్యులు మార్గ మధ్యలోనే శివాణి మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై ఎలాంటి అనుమానం లేదని, అమ్మమ్మ నర్సవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తహసీల్దార్, ఆర్‌ఐలపై చర్యలు తీసుకోవాలి


అదనపు కలెక్టర్‌లకు ఫిర్యాదు చేస్తున్న జెడ్పీటీసీ, తదితరులు

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండలంలోని జాలపల్లి గ్రామంలో డబుల్ బెడ్రూం ఇళ్ల పట్టాల పంపిణీలో అవకతవకలకు పాల్పడిన తహసీల్దార్, ఆర్‌ఐలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా అదనపు కలెక్టర్‌లు శ్రీనివాస్‌రెడ్డి, నిధి అగర్వాల్‌లకు జెడ్పీటీసీ గిరికొండల్‌రెడ్డి, ఎంపీటీసీ చెట్కూరి కల్యాణికమలాకర్, గ్రామస్తులతో కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు గ్రామసభలో తీర్మానం చేసిన పేర్లు కాకుండా అనర్హులను జాబితాలో చేర్చి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారని వినతిలో పేర్కొన్నారు. ఈ విషయంపై తహసీల్దార్‌ను అడిగితే నిర్లక్ష్యంగా సమాధానాలు చెబుతున్నారని అదనపు కలెక్టర్‌లకు వివరించారు. పంపిణీ చేసిన పట్టాలను రద్దు చేసి గ్రామసభలో మళ్లీ లబ్ధిదారులను ఎంపిక చేయాలని కోరారు. అదేవిధంగా ప్రోటోకాల్ పాటించని రెవెన్యూ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై క్షేత్రస్థాయిలో విచారణ చేస్తామని కలెక్టర్లు హామీ ఇచ్చారిన వారు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇండ్లు


మెదక్ మున్సిపాలిటీ: భారీ వర్షంతో కూలిన ఇల్లు


రేగోడ్: కూలిన ఇంటి గోడను చూపిస్తున్న బాధితులు

అల్లాదుర్గం(మెదక్): రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అల్లాదుర్గంలో కుమ్మరి అంజమ్మకు చెందిన ఇల్లు కూలిపోయింది. ఆ సయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. మండలంలో మూడు ఇళ్లు కూలిపోయినట్లు తహసీల్దార్ తులసిరాం తెలిపారు.

రేగోడ్(మెదక్): వర్షాలకు రేగోడ్ మండలంలో సంగమేశ్వర తండా పంచాయతీ పరిధిలో బురాన్‌వాడి తండాలో శంకర్ నాయక్ ఇల్లు కూలిపోయింది.

మెదక్ మున్సిపాలిటీ: వర్షం కారణంగా మెదక్ పట్టణంలో పట్టణంలోని బారా ఇమామ్ వీధిలో జంగంగారి రఘుకు చెందిన ఇల్లు కూలింది.

తూప్రాన్: మండలంలోని ఆయా గ్రామాల్లో ఆరు ఇండ్లు కూలినట్లుగా తహసీల్దార్ జ్ఞానజ్యోతి తెలిపారు. యావపూర్ బండారు నాగరాజు, యాసికి వీరమణి ఇళ్లతో పాటు పడాల్‌పల్లిలో రెండు, రావెల్లి, ఇమాంపూర్‌లో ఒకటి చొప్పున కూలిపోయినట్లు తెలిపారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): వర్షానికి చిలప్‌చెడ్ మండలంలోని బండపోతుగల్ గ్రామంలో టహెద్ అలీ రేకుల ఇల్లు, జగ్గంపేటలో బత్తిలి గంగమ్మ, అజ్జమర్రి, ఫైజాబాద్‌లో ఇండ్లు పాక్షికంగా కూలిపోయాయి.

చేగుంట(తూప్రాన్): చేగుంట మండలంలోని చందాయిపేటలో గాజుల అహ్మద్‌కు చెందిన ఇల్లు, బీకొండాపూర్‌లో బాలనర్సింలు ఇల్లు పాక్షికంగా కూలాయి.

మూడు పాడిగేదెలు మృత్యువాత


శివ్వంపేట(నర్సాపూర్): పాడిగేదె కళేబరం

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని సికింద్లాపూర్ శివారు వ్యవసాయ బోరుబావులకు విద్యుత్ సరఫరా చేసే లైన్ తీగలు తెగి పడడంతో చేగూరి సత్యనారాయణగౌడ్‌కు చెందిన మూడు పాడిగేదెలు మృత్యువాత పడ్డాయి. గేదెల విలువరూ.1.80లక్షలు ఉంటుందని తెలిపారు. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ ఏనుగు సుధాకర్‌రెడ్డి కోరారు.


తూప్రాన్: యావపూర్‌లో వర్షానికి కూలిన ఇల్లు


చిలప్‌చెడ్(నర్సాపూర్): బండపోతుగలో కూలిన రేకుల ఇల్లు


చేగుంట(తూప్రాన్): చందాయిపేటలో కూలిన అహ్మద్‌కు చెందిన పెంకుటిల్లు